ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
సోమవారం 3 జూన్ 2024




భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 31.0



జువ్వలపాలెం రోడ్డులో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద పరేడ్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల , జేసీ ప్రవీణ్

కౌంట్‌డౌన్





సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. మరికొద్ది గంటల్లోనే పార్లమెంట్, అసెంబ్లీ ఓట్ల లెక్కింపు జిల్లాకేంద్రమైన భీమవరంలో జరగనుంది. ఈ మేరకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రాలకు 200 మీటర్లు మేర రెడ్‌జోన్‌గా ప్రకటించారు. ఇంతకు ముందే ఈ ప్రాంతాన్ని నో ఫ్లయ్‌జోన్‌గా నిర్ధారించారు. ఓట్ల లెక్కింపు సిబ్బంది మంగళవారం ఉదయం 6 గంటలకు, కౌంటింగ్ ఏజెంట్లు 7 గంటలకు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలి.

రేపు కౌంటింగ్.. ఏర్పాట్లు పూర్తి



భీమవరం- ఆంధ్రజ్యోతి , జూన్ 2 : శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ఠ చర్యలు తీసుకుంది. హైఎలర్ట్ ప్రకటించింది. ఇది వరకే పార్టీ శ్రేణులకు, నాయకులకు అవగాహన కల్పించింది. నిబంధనలు ఉల్లంఘించరాదంటూ హెచ్చరికలు జారీ చేశారు. జిల్లా అంతటా 144 సెక్షన్ విధించారు. మరోవైపు ఫలితాలు అనంతరం ఎటువంటి ర్యాలీలు, సంబరాలు నిర్వహించకుండా నిషేదం విధించారు. ఈనెల 6 వ తేదీవరకు ర్యాలీలు, పాదయాత్రలు, సంబరాలు చేసుకోకూడదు. ఫలితాలు వెలువడుతున్న సమయంలో ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే తక్షణమే సమాచారం అందించాలని, క్షేత్రస్థాయి సిబ్బందికి జిల్లా అధికారులు దిశానిర్దేశం చేసారు. మద్యం షాపులను, బార్‌లను సోమవారం సాయంత్రం 3 గంటల నుంచి ఫలితాలు వెలువడే వరకు మూసివేస్తారు. జిల్లాలో సున్నితమైన ప్రాంతాలను గుర్తించారు. ఎన్నికల లెక్కింపు రోజున షాపులను మూసివెయ్యాలంటూ నోటీసులు జారీ చేశారు. భీమవరంలో లాడ్జీలను పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఎన్నికలకు సంబందించి ఏజెంట్‌లు, నాయకులను తప్ప వేరే ప్రాంతాలవారు ఎవరైనా ఉన్నారా ? ఉండటానికి గల కారణాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటున్నారు. ఏజెంట్లు అందరూ ఒక్కరోజు ముందుగానే భీమవరం చేరుకుంటున్నారు. వారికి నియామక పత్రాలను అందించారు. జిల్లాలో ఎటువంటి ఘర్షణలకు తావులేందంటూ అధికారులు గుర్తించారు. పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో ముందు జాగ్రత్త చర్యలుగా కేంద్ర బలగాలను బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ఎస్‌ఆర్‌కేఆర్, విష్ణు కళాశాలల్లో..

2024 సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో లెక్కింపు నిర్వహించనున్నారు ప్రతీ నియోజకవర్గానికి 14 టేబుల్స్ సిద్ధం చేశారు. నియోజకవర్గాలోని పోలింగ్ బూత్‌ల సంఖ్యను బట్టి రౌండ్‌ల వారీగా ఫలితాలను వెల్లడించనున్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కిస్తారు. అనంతరం ఈవీఎంలు లెక్కింపు ప్రారంభం కానుంది. ఏజెంట్లను ఆయా రాజకీయ పార్టీలు ఏర్పాటు చేశారు. ముందగానే ఏజెంట్లు భీమవరం చేరుకునేలా కసరత్తు పూర్తిచేశారు. ఉదయం 5 గంటలలోపే కౌంటింగ్ హాల్‌కు చేరుకోనున్నారు.

భీమవరంలో హోటల్స్ కిటకిట

భీమవరంలో ఏడు నియోజక వర్గాలకు సంబందించి కౌంటింగ్ ఏర్పాటు చెయ్యడంతో పట్టణంలో ఉన్న లాడ్జీలు దాదాపు కిటకిటలాడుతున్నాయి. సోమవారం రాత్రి ఏజెంట్లను భీమవరం తరలించాల్సి ఉండటంతో పాటు మంగళవారం తెల్లవారుజామున కౌంటింగ్ సెంటర్లకు పంపాల్సి ఉండటంతో ముందు జాగ్రత్త చర్యగా లాడ్జిలను బుక్ చేసి అందులో బస ఏర్పాటు చేసి వారికి కావలసిన ఆహార పదార్థాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రెండు రోజులుగా ఏర్పాట్లలో తలమునకలైఉన్నారు. వీరే కుకుండా ఇతర నాయకులు, ముఖ్య నాయకులు పెద్దపెద్ద హోటల్స్‌ను బుక్ చేసుకుని ఉంచుకున్నట్లు చెబుతున్నారు.

బస్సుల ఏర్పాటు

కౌంటింగ్ సెంటర్లకు ఒక కిలోమీటర్ పరిధిలో స్టైరైల్ జోన్‌గా పరిగణిస్తారు. అక్కడ నుంచి కౌంటింగ్ కేంద్రం ముఖద్వారం వరకు కౌంటింగ్ ఏజెంట్లకు, కౌంటింగ్ సిబ్బంది రవాణాకు బస్సులు ఏర్పాటు చేశారు. విష్ణు కాలేజ్ కౌంటింగ్ సెంటర్ చేరుకోవడానికి 16 బస్సులు, ఎస్‌ఆర్‌కేఆర్ కౌంటింగ్ సెంటర్ చేరుకోవడానికి 10 బస్సులను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ హాల్స్ లోపలికి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, ఇయర్ ఫోన్లు, ఇయర్ మెషీన్లు అనుమతించరు, అగ్గిపెట్టెలు, పదునైన వస్తువులు మొదలైనవి ఖచ్చితంగా నిషేధం. మీడియా ప్రతినిధులకు సెల్ ఫోన్లు మీడియా సెంటర్ వరకు మాత్రమే అనుమతిస్తారు.

కౌంటింగ్ కేంద్రాలు ఇవే

భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజక వర్గాలకు సంబంధించి భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాలలోను, ఆచంట, పాలకొల్లు, నర్సాపురం, తణుకు నియోజకవర్గాలకు సంబంధించి విష్ణు కాలేజీలోనూ ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

నేటి సాయంత్రం నుంచి మద్యం షాపుల బంద్..



భీమవరం క్రైం, జూన్ 2 : కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో ఉన్న అన్ని మద్యం షాపులు, బార్లు ఈనెల మూడో తేదీ సాయంత్రం ఐదు గంటల నుంచి మూసి వేస్తున్నట్లు భీమవరం మద్యం డిపో సీఐ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 5వ తేదీ ఉదయం 11 గంటల వరకు మద్యం షాపులు, బార్లను మూసివేస్తున్నట్లు తెలిపారు. తిరిగి 5వ తేదీ ఉదయం 11 గంటలకు షాపులు,బార్లు తెరుచుకుంటాయని వివరించారు.

959 మంది సిబ్బంది

భీమవరం టౌన్, జూన్ 2 :కౌంటింగ్ అధికార్లకు, సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ పక్రియను కౌంటింగ్ పరిశీలకుల సమక్షంలో పూర్తిచేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు సుమిత్ కుమార్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి ఆదివారం కలెక్టరేట్‌లో అధికారులకు, సిబ్బందికి నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ సెంటర్లు కేటాయించారు. నరసాపురం పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లు లెక్కిం చేందుకు, పర్యవేక్షించేందుకు కౌంటింగు సూపర్ వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు రిజర్వుడు స్టాఫ్‌తో కలిపి మొత్తం 959 మందిని నియమించారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు 294 మంది, అసిస్టెంట్లు 348 మంది, మైక్రో అబ్జర్వర్లు 317 మంది ఉన్నారు. తాడేపల్లి గూడెం, ఉండి, భీమవరం నియోజకవర్గాలకు ఎం.దీప, నరసాపురం, తణుకు నియోజకవర్గాలకు నిర్మలరాజ్ ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాలకు బీడీ కుమావత్ కౌంటింగ్ పరిశీలకులుగా వ్యవహరించనున్నారని తెలిపారు. 147 మంది కౌంటింగ్ ఏజెంట్స్‌ను వివిధ రాజకీయ పార్టీల తరఫున నియమించారు. జేసీ ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, డ్వామా పీడీ ప్రభాకరరావు, డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, డీఎల్‌డీవో అప్పారావు, ఎలక్షన్ సూపరింటెండెంట్ చందన దుర్గాప్రసాదు, డిప్యూటీ తహసీల్దారు సన్యాసిరావు, ఐటీ డిప్యూటీ డైరెక్టరు బొప్పన బాలయ్య ఎన్‌ఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతర నిఘా

కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వీడియో గ్రఫీ ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేశారని వీటిని అనుసంధానిస్తూ ఒక కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేశామని కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం తెలిపారు. కౌంటింగ్ సమయంలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే కౌంటింగ్ ఏజెంట్లు మైక్రో అబ్జర్వర్‌కు గాని, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌కి గాని తెలియజేయాలన్నారు. అలా కాకుండా గలాటా సృష్టించాలని ప్రయత్నిస్తే కౌంటింగ్ కేంద్రం నుంచి బయటికి పంపడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద కేంద్ర, రాష్ట్ర బలగాలతో నిర్వహించిన పరేడ్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పాల్గొన్నారు. కౌంటింగ్ అనంతరం మరో రెండు రోజుల పాటు మీకు ఏర్పాటు చేసిన ప్రాంతాలలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలకు భరోసా కల్పించాలన్నారు.

జిల్లా అంతటా 144 సెక్షన్ : ఎస్పీ



కౌంటింగ్ రోజున జిల్లా అంతటా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని జిల్లాలో ప్రశాంతతకు భంగం కలిగించే ఏ విషయాన్ని అయినా ఉపేక్షించేది లేదని జిల్లా సూపరింటెండెంట్ అజిత వెజేండ్ల హెచ్చరించారు. సంబంధం లేని వ్యక్తులు సరైన కారణం లేకుండా కౌంటింగ్ కేంద్రాల పరిదిలోని హోటల్లు, లాడ్జిల్లో బస చేయకూడదని, తనిఖీల్లో దొరికితే కస్టడీకి తీసుకుంటామని స్పష్టం చేశారు. మూడంచెల భద్రత కొనసాగుతుందని, కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలోని 137 గ్రామాల్లో పికెటింగ్ కొనసాగుతుందని, ఆరు వేల మందిని బైండోవర్ చేశామన్నారు ఖచ్చితంగా కౌంటింగ్ రోజు, తరువాత రోజుల్లో ఎవరైనా నిబంధనలను అతిక్రమించ డానికి ప్రయత్నిస్తే నాన్ బెయిలబుల్‌గా ఉండే కఠినమైన సెక్షన్‌లతో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తామన్నారు. అలజడులకు కారణమైన వారితో పాటు, వారిని ప్రోత్సహించినవారిపై కూడా నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి, పాస్ పోర్టు అవకాశాలు దెబ్బతింటాయన్నారు.



ఉండి సెంటర్‌లో పరిశీలిస్తున్న అడిషనల్ డీఎస్పీ బాషా, రైల్వే డీఎస్పీ నాగేశ్వరరావు

12,16,558 మంది ఓటేశారు..




భీమవరం టౌన్ : ఈ ఎన్నికలల్లో జిల్లాలో మొత్తం 14 లక్షల 72 వేల 923 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 7 లక్షల 21 వేల 532 మంది, మహిళలు 7 లక్షల 51 వేల 313 మంది ఉన్నారు. ఇతరులు 78 మంది ఉన్నారు. వీరిలో 12 లక్షల 16వేల 558 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 6 లక్షల 02 వేల 480 మంది, మహిళలు 6 లక్షల 14వేల 031 మహిళలు, 47 మంది ఇతరులు ఓటు వేశారు.

హోమ్ ఓటింగ్ (85+)

ఏడు నియోజకవర్గాల్లో హోమ్ ఓటింగ్ వినియోగించుకున్నవారు మొత్తం 1072 మంది ఉండగా అందులో 85 ఏళ్ల వయసు పైబడి ఉన్నవారు 536 మంది ఉన్నారు. ఆచంట నియోజకవర్గంలో 39, పాలకొల్లులో 165, నరసాపురంలో 60, భీమవరంలో 57, ఉండిలో 65, తణుకులో 81, తాడేపల్లిగూడెంలో 69 మంది వినియోగించుకున్నారు. 1022 మంది దివ్యాంగులు హోం ఓటింగ్ విని యోగించుకోగా, వీరిలో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో 553 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. నియోజక వర్గాల వారీగా ఆచంట 48, పాలకొల్లు 154 నరసాపురం 46, భీమవరం 50, ఉండి 81 , తణుకు 93 , తాడేపల్లిగూడెం 81 మంది హోమ్ ఓటింగ్ వినియోగించుకున్నారు.

పోస్టల్ బ్యాలెట్ 13,345



జిల్లాలో మొత్తం 13,345 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. నియోజకవర్గాల వారీగా ఆచంట 1,430, పాలకొల్లు 2,143, నరసాపురం 1,566, భీమవరం 2,598 ఉండి 1,631, తణుకు 2,082, తాడేపల్లిగూడెం1,895 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నట్లు తెలిపారు. 880 మంది సర్వీస్ ఓటర్లు బ్యాలెట్ ఓటును డౌన్లోడ్ చేసుకోగా నేటి వరకు 350 మంది పోస్ట్ ద్వారా పింపించారు. కౌంటింగ్ రోజున కౌంటింగ్ ప్రారంభానికి ముందు ఒక గంట వరకు సర్వీస్ ఓట్లను పోస్ట్ ద్వారా అందించవచ్చు. పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుల్స్ పోస్టల్ బ్యాలెట్‌కు, ఒక టేబుల్ సర్వీస్ ఓట్ల లెక్కింపునకు వినియోగిస్తారు. పార్లమెంట్‌కు సంబంధించి విష్ణు కాలేజీ లైబ్రరీ రీడింగ్ రూమ్ గ్రౌండ్ ఫ్లోర్ నందు లెక్కింపు జరుగుతుంది. ఏడు నియోజకవర్గాలకు సంబంధించి నాలుగు టేబుల్స్ పోస్టల్ బ్యాలెట్‌కు, సర్వీస్ ఓట్ల లెక్కింపు ఆయా నియోజక వర్గాల కౌంటింగ్ హాల్స్ నందు నిర్వహిస్తారు. ఈవీఎంల కౌంటింగ్ పార్లమెంటరీ నియోజకవర్గానికి 14 టేబుల్స్, అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుల్స్ చొప్పున ఏడు నియోజకవర్గాల కౌంటింగ్ హాల్స్ నందు లెక్కింపు జరుగుతుంది.

నియోజకవర్గం	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	పోలింగ్ శాతం
ఆచంట	1,49,048	73,024	76,022	82.80
పాలకొల్లు	1,60,489	79,802	80,684	82.28
నరసాపురం	1,43,825	72, 596	71,227	84.38
భీమవరం	2,00,857	99,174	1,01,656	79.35
ఉండి	1.93.722	96.695	97,025	86.20
తణుకు	1,92,627	93,979	98,644	82.12
తాడేపల్లిగూడెం	1,75, 990	82,208	88,773	81.86



దేవుడా..దేవుడా !

ఈనెల 13న జరిగిన సాధారణ ఎన్నికల్లో బారీ ఎత్తున ఓట్లు నమోదయ్యాయి. ఎవరంతటి వారుగా ఆయా పార్టీల అభ్యర్థులంతా ఓటర్లు తమకే పట్టం కట్టబోతున్నారంటూ ఓ అంచనాకు వచ్చేశారు. కానీ ఓటర్లు గుమ్మనంగా వ్యవహరించడం, చివరి రెండు గంటల్లోనూ అనూహ్యంగా పోలింగ్ శాతం పెరగటం కూడా పార్టీ అభ్యర్థులను తికమకపెడుతోంది. ఈ లోపే స్థానిక నేతల అంచనాలు తమకు అనుకూలంగా ఉన్న, వ్యతిరేకంగా ఉన్న వివిధ సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ కూడా వెలువడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా కూటమిదే పై చేయి అంటూ ఆ సర్వే ఫలితాలు ఉన్నాయి. కాని మరికొన్ని సర్వే సంస్థలు అధికార వైసీపీకే తిరిగి పగ్గాలు ఖాయమంటూ విశ్లేషణలు . వీటన్నింటి నడుమ మంగళవారం జరగబోయే ఓట్ల లెక్కింపులో తుది ప్రజాతీర్పు వెలువడనుంది. దీంతో ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో పోటీ చేసిన అభ్యర్థులంతా తీవ్ర ఉత్కంఠలో ఉన్నారు. ఆదివారం అంతా తుది అంచనాలకు వచ్చేందుకు వీలుగా తమ సన్నిహితులతో మరోసారి బేటీ అయ్యారు. కౌంటింగ్‌కు వెళ్ళే ఏజెంట్లు, చీఫ్ ఏజెంట్లతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించారు. ఎక్కడా ఏ లోటు జరగకుండా కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు కౌంటింగ్ కేంద్రాన్ని విడిచి వెళ్ళరాదంటూ నిర్దేశం చేశారు. తమ ఆదేశాలు పాటించకుండా ఇష్టానుసారం వ్యవహరించవద్దంటూ సున్నిత హెచ్చరికలు చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు లభించే ఓట్లను క్షుణంగా పరిశీలించాలని, పోస్టల్ బ్యాలెట్లను తిరస్కరిస్తే నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? లేదా? అనే దాని పై నిర్ధారించుకోవాలని అభ్యర్థులంతా తమ ఏజెంట్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.



చల్లగా.. హాయిగా

కేపీ పాలెం, పేరుపాలెం సాగరతీరాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి వాతావరణం మబ్బులతో చల్లగా ఉండడంతో బీచ్‌కు చేరారు. చల్లని మబ్బులతో పాటు ఎగిసిపడే అలలతో ఆడుతూ సముద్ర స్నానాలు చేశారు. - మొగల్తూరు

రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు సిద్ధం చెయ్యాలి

పంట కాలంలో ముంపు సమస్యకు పరిష్కారం చూపాలి

రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి సమావేశం



సమావేశంలో పాల్గొన్న రామరాజు, నాగేశ్వరరావు తదితరులు

భీమవరం టౌన్, జూన్ 2 : రైతులకు ఈ సీజన్‌లో అవసరమైన వరి విత్తనాలను ముందస్తుగా సిద్ధం చెయ్యాలని, ఎరువుల కొరత లేకుండా చూడాలని, రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి నాయకులు కోరారు. ఆదివారం భీమవరం ఏఎస్‌ఆర్ నగర్‌లో సమితి కార్యాయలంలో రైతు నాయకులతో సమావేశం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీరామరాజు మాట్లాడుతూ గత వారం రైతు సమస్యలపై కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. విత్తనాలు, ఎరువులు, కాల్వల ఆధునికీకరణ సమస్యలను వివరించామన్నారు. ఎన్నికల పక్రియ ముగిసిన వెంటనే ఈ పంటకాలానికి సంబంధించి సమస్యలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని కలెక్టర్ చెప్పారన్నారు. మురుగు కాల్వల అభివృద్ధికి ప్రతిపాదనలు ఇప్పటికే పంపిచామని, జలవనరుల శాఖతో వివరణ ఇప్పించారని తెలిపారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను వ్యవసాయశాఖ ద్వారా సిద్ధం చేస్తున్నట్ల వివరించారన్నారు. ప్రధాన కార్యదర్శి తమ్మినీడి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత పంట కాలంలో సాగు ముందస్తుగా చేపట్టిన రైతులు ఎకరానికి 50 బస్తాలు పండించారని ఆలస్యంగా వేసిన వారికి 40 బస్తాలే వచ్చాయన్నారు. అందువల్ల ముందస్తు సాగుకు అధికారులు కృషి చెయ్యాలని కోరారు. సమావేశంలో రైతు కార్యాచరణ సమితి గౌరవాధ్యక్షుడు కలిదిండి గోపాలకృష్ణంరాజు, అధికార ప్రతినిధి కె.కమలాకర శర్మ, కోశాధికారి గొట్టుముక్కల వెంకట భీమరాజు, సభ్యులు కోరుకొల్లు మురళీ రాజు, దండు సత్యనారాయణరాజు, దాసరి సత్యనారాయణ, మంతెన వెంకటేశ్వరరాజు, గొట్టుముక్కల కృష్ణంరాజు, డాక్టర్ దండు జగన్నాథరాజు, గొట్టుముక్కల మల్లిఖార్జునరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 2: ఉపాధి హామీ పని చేస్తూ కూలి గుండెపోటుతో మృతి చెందిన ఘటన తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆలపాటి వెంకట్రావు(58) పంటబోదె తవ్వుతుండగా గుండెపోటు రావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్టు తెలిపారు.

● ఏలూరు క్రైం : రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెందాడు. అస్సాం రాష్ట్రానికి చెందిన దూడుల్ బోనుష్ (29) తన మామయ్యతో కాలిసి చేపల చెరువుకు మేత వేసే పనికి ఏలూరుకు వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నాడు. భీమడోలు రైల్వే స్టేషన్ దాటిన తరువాత ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. బోగీలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రమాదవ శాత్తు జారి పడ్డాడని గుర్తించారు. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్ఐ డి.నరసింహారావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● నరసాపురం రూరల్, జూన్ 2: తేనేటీగల దాడిలో తీవ్రంగా గాయపడి


నర్సింహాస్వామి

చికిత్స పొందుతున్న నర్సింహా స్వామి(60) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. గొంది గ్రామంలో తోటి కార్మికులతో కలిసి గత నెల 31వ తేదీన ఉపాధి పనులు చేస్తుండగా నర్సింహాస్వామి, నాగేశ్వరరావు పై తేనేటీగలు దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దర్ని పాలకొల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాగేశ్వరరావుకు మెరుగైన వైద్యం కోసం భీమవరంలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించగా.... నర్సింహాస్వామి మాత్రం పాలకొల్లు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నర్సింహాస్వామికి మెరుగైన వైద్యం అందినప్పటికీ మృతి చెందడంతో గొంది గ్రామంలో విషాదం అలుముకుంది. గతంలో తీర ప్రాంతాల్లో ఈ తరహా తేనేటీగలు కుట్టి ఒక్కరూ మృతి చెందారు. నర్సింహాస్వామి పార్థదేహాన్ని ఎంపీడీవో రమణరావు, సర్పంచ్ మద్దాల అంజిబాబు, వైఎస్ నాగేశ్వరరావు సందర్శించి సంతాపం తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ


విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన చేపల లోడు లారీ

ఆకివీడు, జూన్ 2: చేపల లోడుతో వెళ్తున్న లారీకి డ్రైవర్ బ్రేక్ వేయడంతో స్కిడ్ అయి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. ఆదివారం ఆకివీడు నుంచి అజ్జమూరు వెళ్తున్న చేపల లోడు లారీ అజ్జాలమ్మ ఆలయం మలుపు దగ్గర డ్రైవర్ బ్రేక్ వేయగా జారీ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో లారీలో ఉన్న కార్మికులు కిందపడ్డి గాయాలపాలయ్యారు. వీరిని ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. విద్యుత్ అధికారులు, సిబ్బంది వచ్చి స్తంభాన్ని సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 2 : తన కమార్తె ఇంటి నుంచి కాలేజీకి వెళ్లి తిరిగి రాలేదని తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దెందులూరు మండలంలోని ఒక గ్రామానికి చెందిన విద్యార్థిని(21) డిగ్రీ చదువుతుంది. ప్రతి రోజు ఆర్టీసీ బస్సులో కళాశాలకు వెళ్లివచ్చేది. గత నెల 31వ తేదీన కాలేజీకి వెళ్లిన ఆమె ఇంటికి చేరుకోలేదు. ఈ సంఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనంపై...

పెదపాడు, జూన్ 2 : తాళ్లమూడిలో జరిగిన దొంగతనంపై పెదపాడు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన చొప్పవరపు రామ్మోహనరావు కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 28వ తేదీన వేరే గ్రామానికి వెళ్లారు. జూన్ ఒకటో తేదీన ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగినట్లుగా గుర్తించి, పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరకాసు బంగారు దిద్దులు, రూ.15 వేల నగదుతో పాటు వెండి వస్తువులు పోయినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా పెదపాడు ఎస్ఐ కె.శుభశేఖర్ తెలిపారు.

రెండు కోళ్లవ్యర్థాల వాహనాల పట్టివేత

పెదపాడు, జూన్ 2 : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు, తోటగూడెం గ్రామాల వద్ద వాహనాలను తనిఖీ చేసి రెండు వాహనాలను పట్టుకున్నట్లుగా ఎస్ఐ కె.శుభశేఖర్ తెలిపారు. వాహన, చెరువు యజమానులు, వాహన డ్రైవర్లపై కేసు నమోదు చేసి పెదపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు : ఏడుగురికి గాయాలు


ట్రావెల్ బస్సు ముందు భాగం

దేవరపల్లి, జూన్ 2: లారీని ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రం గాను, ఆరు గురికి స్వల్పంగాను గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. ఆది వారం ఉదయం దేవరపల్లి మండలం బంద పురం జాతీయ రహదారిపై లారీ సెల్ఫ్ ఆగిపోవడంతో నెమ్మదిగా వెళ్తుండగా హైదరాబాద్ నుంచి భువనేశ్వర్ వెళ్తున్న కావేరి ట్రావెల్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం ధ్వంసమైంది. బస్సు డ్రైవర్‌కు తీవ్రగాయాలు కావడంతో గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బస్సులో 35 మంది ప్రయాణిస్తుండగా అందులో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

నాటక పరిషత్‌ల కృషి ఎనలేనిది

- ప్రముఖ రంగస్థల నటీమణి రత్నకుమారికి సత్కారం
- నాలుగో రోజు రెండు నాటికల ప్రదర్శన


రాయప్రోలు రామచంద్రమూర్తి రంగస్థల చైతన్య పురస్కారం అందుకుంటున్న అప్పాజోస్యుల సత్యనారాయణ


స్వప్నం రాల్చిన అమృతం నాటికలోని సన్నివేశం

భీమవరం అర్బన్, జూన్ 2: కనుమరుగవుతున్న కళలను, కళాకారులను ప్రోత్సహించడానికి నాటక పరిషత్‌లు చేస్తున్న కృషి ఎనలేనిదని పలువురు వక్తలు అన్నారు. చైతన్యభారతి సంగీత నృత్య నాటక పరిషత్ ఆధ్వర్యంలో భీమవరంలోని డీఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియ స్కూల్ ఆవరణంలో జరుగుతున్న 17వ జాతీయ స్థాయి తెలుగు నాటిక పోటీలలో నాలుగో రోజు ఆదివారం రాత్రి రెండు నాటికలు ప్రదర్శించారు. ముందుగా ఈ నాటిక పోటీలను మావుళ్లమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ కారుమూరి సత్యనారాయణ, సూర్య మిత్ర చైర్మన్ ఇర్రింకి సూర్యరావు, సీనియర్ న్యాయవాది తాడిమళ్ల గిరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆజో,విభో,కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకులు అప్పాజోస్యుల సత్యనారాయణకు రాయప్రోలు రామచంద్ర మూర్తి రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల నటీమణి ఎం.రత్నకుమారికి పెనుపోతుల శేషగిరిరావు రంగస్థల చైతన్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆనంతరం ప్రదర్శించిన రెండు నాటికలు ఆహుతులను కళా ప్రియులను అలరించాయి. నాటక పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు రాయప్రోలు భగవాన్, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాస్, బోండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణవర్మ, కర్రెడ్డి సత్యనారాయణ, వడుపు గోపి పాల్గొన్నారు. నాటికల న్యాయ నిర్ణేతలుగా మనాపురం సత్యనారాయణ, పంపన ధనంబాబు, డాక్టర్ ఎన్‌వీ కృష్ణారావు వ్యవహరించారు.

'స్వప్నం రాల్చిన అమృతం'

'ఒక కాకికి దెబ్బతగిలి కిందపడితే పది కాకులు చుట్టు చేరి కావు... కావు అంటూ అరుస్తాయి.. వాటి మధ్య ఏ బంధాలు సంబంధాలు లేకపోయినా సరే సాటి కాకులుగా గొప్ప సానుభూతిని చూపిస్తాయి. భార్య భర్తల బంధానికి అనుబంధానికి విలువనిచ్చే మనుషులం.. ఆ కాకుల్లో ఉన్న కనీస జ్ఞానం మనలో లేకపోతే ఎలా' అని తెలియజేప్పిన స్వప్నం రాల్చిన అమృతం నాటిక, మూలకథ పీఎస్ నారాయణ, నాటీకీకరణ రచన పరమాత్ముని శివరాం, రమేష్ మంచాల దర్శకత్వం వ్యవహరించగా.. నటీనటులు తమ పాత్రలతో అందరిని అలరించారు. చివరి నాటికగా వీటీపీఎస్ కల్చరల్ అసోసియేషన్ ఇబ్రహీంపట్నం వారి 'ఏనిమి' నాటిక ప్రదర్శించారు.

షాపుల ఆక్రమణలు తొలగింపు



బస్టాండ్ రోడ్డులో అక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పాలకొల్లు అర్బన్, జూన్ 2 : చిన్నపాటి వర్షానికే బస్టాండ్ ఆవరణ మునిగిపోయి ప్రయాణికులు అవస్థలు పడుతున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో గతవారం వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కొంత కాలం క్రితం మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో పట్టణంలోని కచ్చా డ్రైన్లలో సీల్ట్ తీయించారు. అయితే బస్టాండ్ సమీపంలో గల డ్రైన్లను షాపుల వారు అక్రమించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారం వేయడంతో పూర్తిగా పూడుకుపోయాయి. దీంతో మురుగు నీటి పారుదల లేక రోడ్లపైకి, బస్టాండ్ ఆవరణలోకి నీరు చేరుతోంది. చిన్నపాటి వర్షానికే బస్టాండ్ ఆవరణ మురుగు నీటితో నిండిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై కమిషనర్ ఇతర అధికారులు స్పందించి, శని, ఆదివారాల్లో జేసీబీలతో షాపుల ముందు అక్రమణలు, మున్సిపల్ కాంప్లెక్స్ వద్దనే డ్రైనేజీపైన వేసిన సిమెంట్ పలకలు తొలగించారు. తాము వ్యాపారాలు కోల్పోతున్నామని, అద్దెలు ఏలా కట్టగలమని కాంప్లెక్స్‌లో వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా కౌన్సిల్ లేకపోవడం, అధికారులు పట్టించుకోకున్నా, ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రాడంతో మున్సిపల్ కమిషనర్ విజయ సారధి, ఆర్ఐ శ్రీనివాస రాజు, టీపీవో బ్రహ్మం, టీపీఎస్ త్రినాధరావు సిబ్బంది అక్రమణలు తొలగించి, డ్రైన్లలో సిల్ట్ తొలగించడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణబాబుకు ఘన నివాళి


మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబుకు నివాళులర్పిస్తున్న దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు


మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు

కొవ్వూరు, జూన్ 2 : కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, పారిశ్రామికవేత్త పెండ్యాల వెంకటకృష్ణారావు (కృష్ణబాబు) మృతికి పలువురు నేతలు సంతాపం తెలిపారు. ఆదివారం కొవ్వూరు మండలం దొమ్మేరులో జరిగిన కృష్ణబాబు దశ దిన కార్యక్రమానికి పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు విచ్చేసి కృష్ణబాబు సోదరుడు ది ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ చైర్మన్ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు)తో పాటు కృష్ణబాబు అల్లుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు, హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, రాజమహేంద్రవరం పార్లమెంటు కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, నరసాపురం ఎంపీ కనుమూరు రఘురామకృష్ణంరాజు, కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజు, సినీ నిర్మాత కేఎల్ నారాయణ, కొవ్వూరు కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆరిగెల అరుణకుమారి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మాజీ మంత్రులు సీహెచ్ అయ్యన్నపాత్రుడు, కామినేని శ్రీనివాస్, కావూరి సాంబశివరావు, దొడ్డికర్ల సువర్ణరాజు, మాజీ ఎమ్మెల్యేలు కరణం బలరామ్, టీవీ రామారావు, అవినాష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొర్రెల శ్రీధర్, ద్విసభ్య కమిటి సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, ఇమ్మణి వీరశంకరం, కేవీకే రంగారావు తదితరులు కృష్ణబాబుకు నివాళులర్పించారు.

కిక్కిరిసిన శ్రీవారి క్షేత్రం


క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు

ద్వారకాతిరుమల, జూన్ 2: చిన్నతిరుమలేశుని ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడం వల్ల ఆలయానికి దాదాపు 15 వేల మంది పైబడి యాత్రికులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. వీరంతా ముందుగా ఆలయంలో మొక్కు బడులు తీర్చుకుని, స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకు న్నారు. అనంతరం శ్రీవారి వకుళమాత అన్నదాన భవనంలో అన్నప్రసాదం స్వీకరించారు.

సిరులు కురిపిస్తున్న పసుపు బంగారం

హర్షం వ్యక్తం చేస్తున్న పొగాకు రైతులు


గోపాలపురం పొగాకు వేలం కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బేళ్లు

గోపాలపురం, జూన్ 2: ఉత్తరాంధ్ర తేలిక నేలల్లో పండే ఎన్ఎల్ఎస్ పొగాకు పంట లేకపోతే రైతుకూలీలకు గొప్పెడు మెతుకులు లేవనే సామేత నాడు ప్రస్తుత పొగాకు రైతు పరిస్థితి పొగాకు సాగుతో సిరులు కురిపిస్తుంది. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట అయిన వర్జీనియ పొగాకు గత 50ఏళ్ళ చరిత్రలో ఎన్నడు ఎరుగని విధంగా అత్యధిక ధర పలుకుతుంది. ఈ ప్రాంతంలో పండే పంట దేశంలోనే నాణ్యమైన పొగాకు కావడం ఇతర దేశాలు, రాష్ట్రాల్లో ఈ ఏడాది పొగాకు పంటలో ఒడిదుడుకులు ఎదురవటం వెరసి ఈ ప్రాంత పొగాకు రైతులకు పసుపు బంగారంగా పిలువబడే పొగాకు సాగు సిరులు పంటగా మారింది. గ్రేడ్ - 1 పొగాకు కనీస మద్దతు ధర కంటే నిర్థిష్టమైన ధర పలకటంతో తమ కష్టానికి ఫలితాన్ని ఈ ఏడాది అయినా చూస్తున్నామని పొగాకు రైతు కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. పంటకు గిట్టుబాటు ధర వచ్చిన మరుసాటి ఏడాది నుంచి ఈ ప్రాంతంలో అభివృద్ధి సైతం పరుగులుపెడుతుంది. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ ఇప్పటికే అత్యధికంగా పెరిగిన భూమి కౌలు, క్యూరింగ్ కార్మికులకు అత్యధికంగా పెరిగిన కూలి రేట్లు బేరర్ లైసెన్సులు ఇలా అభివృద్ధికి అన్ని రూపాల్లోనూ ఈ సాగు తోడ్పాటు ఇస్తుందని పొగాకు రైతులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

ఊరి పేరు	గరిష్ట ధర	కనిష్ట ధర	సరాసరి ధర
దేవరపల్లి	331	222	293.75
జంగారెడ్డిగూడెం -1	331	235	291.56
జంగారెడ్డిగూడెం - 2	331	235	295.27
కొయ్యలగూడెం	332	235	294.03
గోపాలపురం	332	222	301.93

వడ దెబ్బకు ఒకరి మృతి

నూజివీడు టౌన్, జూన్ 2: వడదెబ్బకు వ్యక్తి మృతి చెందిన ఘటన నూజివీడు పట్టణంలో చోటుచేసుకుంది. ముసునూరు మండలం గోపవరానికి చెందిన వెలివెల రత్తయ్య (55) ద్విచక్ర వాహనం కొనుగోలు కోసం శనివారం నూజివీడు వచ్చాడు. అనంతరం మద్యం సేవించిన అతను ఎండ దెబ్బకు నూజివీడు రైతు బజారు వీధిలోని ఓ దుకాణం వద్ద పడిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఎండ తీవ్రత నేపథ్యంలో అతడు అస్వస్థతకు గురై మృతిచెందిన విషయాన్ని స్థానికులు ఆదివారం ఉదయం గుర్తించి నూజివీడు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతనివద్ద గల సెల్‌ఫోన్ ఆధారంగా రత్తయ్య మృతి విషయాన్ని అతని కుమారుడు అరుణకుమార్‌కు తెలిపి మృతదేహాన్ని అప్పగించారు.

మబ్బులతో ఆక్సిజన్ సమస్య

- రొయ్యలు, చేపలు మృత్యువాత
- భారీగా నష్టపోతున్న రైతులు


రొయ్యల చెరువులో తిరుగుతున్న ఏరియేటర్స్

మండవల్లి, జూన్ 2: వాతావరణ మార్పులతో ఆక్వా రంగం అతలా కుతలమవుతోంది. ఉక్కపోత ఆక్వా సాగుకు పెనుముప్పుగా మారింది. రొయ్యల చెరువులో ఆక్సిజన్ కొరత తీవ్ర స్థాయికి చేరి కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లుతుందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉష్ణోగ్రత పడిపోవడంతో చెరువుల్లో పీహెచ్‌సీ శాతం తగ్గిపోయింది. మండవల్లి సమీపంలోని ఒక గ్రామ రైతుకు చెందిన 12 టన్నుల 32 కౌంట్ రొయ్యలకు ఆక్సిజన్ సమస్య ఏర్పడి మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రూ.50 లక్షల వరకు ఆ ఒక్క రైతుకి ఆస్తి నష్టం సంభవించింది. ఇదే అదునుగా రొయ్యల ధరను గణనీయంగా తగ్గించి ఎగుమతుదారులు సిండికేట్‌గా మారి సొమ్ము చేసుకుంటున్నారు. రొయ్యలతో పాటు వాతావరణ సమస్య చేపలపై కూడా తీవ్ర ప్రభావం చూపింది. చెరువులో ఆక్సిజన్ అందక చేపలు కూడా మృత్యువాత పడుతున్నాయి. చనిపోయిన చేపలను మార్కెట్‌కు తరలిస్తే కేజీ రూ.10 నుంచి రూ.20లకు మించి కొనుగోలు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులకు దిక్కుతోచని స్థితి ఏర్పడింది. రొయ్యల చెరువులో ఏరియేటర్లు తిరుగుతున్నప్పటికి ఆక్సిజన్ సమస్య ఎదురవడంతో రైతులకు నష్టం తప్పడం లేదు. ఏదేమైనా రెండు రోజులుగా వాతావరణం మార్పు కారణంగా రొయ్యలు, చేపల రైతులకు భారీగానే నష్టం వాటిల్లిందని అంచనా.

ఆర్టీసీ బస్సుని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

29 మందికి గాయాలు


ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు


క్షతగాత్రులను అంబులెన్సులో తరలిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, జూన్ 2: ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొన్న సంఘటనలో 29 మంది గాయపడ్డారు. ఈ సంఘటన 216 జాతీయ రహదారి ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం జరిగింది. కాకినాడ నుంచి ప్రయాణికులతో వస్తున్న అమలాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న బోలేరో వ్యాన్‌ను తప్పించబోయి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవరుతో పాటు, మరో 25 మంది గాయపడ్డారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో డ్రైవరుతో పాటు ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆర్టీసీ బస్సులో 70 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. కాకినాడ నుంచి అమలాపురం వెళుతున్న మరో ఆర్టీసీ బస్సు కోరంగి వద్ద ఆగిపోవడంతో ఆ బస్సులో ఉన్న ప్రయాణికులను కూడా ప్రమాదానికి గురైన బస్సులోకి ఎక్కించడంతో బస్సులో 70 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. హైదరాబాద్ నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆర్టీసీ బస్సులో గాయపడిన డ్రైవరుతో పాటు 25 మంది ప్రయాణికులను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం వారిలో 12 మంది క్షతగాత్రులను అంబులెన్సులో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో అంబాజీపేటకు చెందిన డి.రామసీత, కాకినాడకు చెందిన జి.శ్రీనివాస్, భీమవరానికి చెందిన డి.జాన్‌బాబు, గుత్తెనదీవికి చెందిన సీహెచ్ కృష్ణవేణి, అమలాపురానికి చెందిన కె.సాయివేణి, అయినాపురానికి చెందిన ఎస్.కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన వారంత స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రైవేటు ట్రావెల్స్‌లో గాయపడిన డ్రైవరు, ఇద్దరు ప్రయాణికులను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ బి.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లైంగిక దాడి కేసుపై విచారణ

ముసునూరు, జూన్ 2: మండలంలోని ఒక గ్రామంలో లైంగిక దాడి కేసుపై నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య ఆదివారం విచారణ నిర్వహించారు. కొండపల్లి చెన్నారావు అత్యాచారం చేసినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై డీఎస్పీ సూరేపల్లిలో సమగ్ర విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బాధితురాలు, నిందితుడి మధ్య గతంలో ఏమైనా సంబంధాలు ఉన్నాయా? తదితర అంశాలపై చుట్టు పక్కలవారిని విచారించి, వివరాలు సేకరించారు. లైంగిక దాడికి పాల్పడిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. సమగ్ర నివేదికను జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతికి నివేదిస్తామని తెలిపారు. ఈ విచారణలో ఎస్ఐ పి.వాసు, వీఆర్వో సుబ్బారావు, మహిళా పోలీస్ కరుణ, స్టేషన్ రైటర్ భాగ్యాలరావు తదితరులు పాల్గొన్నారు.


కైకలూరు ఎస్టీ కాలనీలో అనుమానితులను ప్రశ్నిస్తున్న సీఐ రఘు



ముదినేపల్లిలో విజిబుల్ పోలీసింగ్

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కేసులు

- కైకలూరు టౌన్ సీఐ రఘు
- భుజబలపట్నంలో పికెట్ ఏర్పాటు
- విజిబుల్ పోలీసింగ్‌తో పాటు పలుచోట్ల కార్డన్ సెర్చ్

కైకలూరు, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఈ నెల 4న నిర్వహిస్తున్నందున గ్రామాల్లో 144వ సెక్షన్ అమలులో ఉంటుందని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కేసులు నమోదవుతాయని కైకలూరు టౌన్ సీఐ ఆకుల రఘు హెచ్చరించారు. ఆదివారం కైకలూరు ఎస్టీ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఆరా తీస్తున్నామని, ఏ విధమైన రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కైకలూరు రూరల్ పోలీసులు మండలంలోని సమస్యాత్మకమైన భుజబలపట్నం గ్రామంలో పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేసినట్లు రూరల్ ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం భుజబలపట్నంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ముందస్తుగా పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

గ్రామాల్లో కవాతు

ముదినేపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేందుకు పోలీసు శాఖ ముదినేపల్లి మండలంలో రంగంలోకి దిగింది. ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్ రావటం, ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు టెన్షన్‌లో ఉండటం, మంగళవారం ఓట్ల లెక్కింపు జరగనుండడంతో గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ముదినేపల్లి, వడాలి, సింగరాయపాలెం, బొమ్మినంపాడు, పెదపాలపర్రు, గురజ, చిగురుకోట గ్రామాల ఏరియాల్లో పోలీస్ పహరా నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

గంగాలమ్మకు ప్రత్యేక పూజలు



నరసాపురం రూరల్, జూన్ 2: మండలంలోని ఎల్‌బిచర్ల గ్రామంలో కొలువైన గంగాలమ్మను ఆదివారం ప్రత్యేకంగా అలకరించారు. జాతర మహోత్సవంలో భాగంగా అమ్మవారిని పూలతో అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సూర్యభగవానుడికి అభిషేకాలు



పాలకొల్లు అర్బన్, జూన్ 2 : స్థానిక కోడిగట్టున ఉన్న శ్రీసూర్య దేవాలయంలో ఆదివారం సందర్భంగా అర్చకులు కొత్తలంక సుబ్రహ్మణ్య శాస్త్రి స్వామి వారికి ఆవు పాలతో అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు పొంగలి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో మేడికొండ శ్రీనివాసరావు చౌదరి, మేడికొండ రామదాసు, దశిక శేషగిరిరావు, సిహెచ్ సుబ్రహ్మణ్యం, జయరాం మహిళలు స్వామిని దర్శించుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైస్‌మిల్లు కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వాసుదేవరావు

కనీస వేతన చట్టం సవరించాలి

ఆకివీడు, జూన్ 2: రాష్ట్రంలో ఏర్పడు కొత్త ప్రభుత్వం రైస్‌మిల్లు కార్మికులకు కనీస వేతన చట్టం సవరించాలని రైస్‌మిల్లు కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రైస్‌మిల్లు కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పెరిగిన ధరలకు అనువుగా కనీస వేతం రూ.26వేలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దుచేశాయని, కార్మికులు ఐక్యతగా ఉండి చట్టాలను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జేఎన్వీ గోపాలన్, తమ్మిశెట్టి కృష్ణ, పెంకి అప్పారావు, కె.తవిటినాయుడు, బొర్రా శ్రీను, గండేటి ఈశ్వరరావు, రత్తయ్య, నిమ్మల శ్రీను, కొండ, యర్రా శ్రీను, చీకటి శ్రీ ను, నాగమ్మ, అన్నపూర్ణ, సాంబశివరావు తదితరులు ఉన్నారు.

జారుడు బల్లలా రహదారి



ఆకివీడు, జూన్ 2: జారుడుబల్లలా రహదారి మారింది. ఇటీవల ఈ రహదారి గుం డా నల్లమట్టి ట్రాక్టర్లు పోటీపడి మరీ రవాణా చేసే సమయంలో రోడ్‌పై సుద్దలు పడ్డాయి. శనివారం రాత్రి నుంచి పడుతున్న చిరుజల్లులకు నల్లమట్టి రోడ్‌లో కలిసిపోవడంతో జారుడుగా మారింది. ఈ జారుడు రోడ్‌లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోడ్ లారీలు మలుపులు దగ్గర బ్రేక్ కొడుతుంటే స్కిడ్ అవుతున్నాయి. సంబంధిత అధికారులు మట్టి తరలించే సమయంలో నిబంధనలు పాటించేలా చర్యలు చేపడితే ఇప్పుడు ఇటువంటి సమస్య తలెత్తేది కాదని స్థానికు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామోత్సవం

ఆకివీడు, జూన్ 2: భుజబలరాయుడు మంచినీటి చెరువు ట్యాంకు దగ్గర ఉన్న అగస్త్యేశ్వరస్వామి గ్రామోత్సవం ఆదివారం జరిగింది. అర్చకులు రామకృష్ణ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో వాడపల్లి బ్రదర్స్ పాల్గొన్నారు.

శాంతి, సామరస్యాలతోనే సమాజ ప్రగతి

భీమవరం క్రైం, జూన్ 2 : మనిషిలో శాంతి లక్షణం ప్రశాంత జీవనానికి మార్గదర్శకమని, శాంతి లేని ప్రదేశాల్లో అశాంతి ప్రబలుతుందని ఆందోళనలు అరాచకాలు ప్రశాంత జీవితానికి అడ్డంకులుగా నిలుస్తాయని భీమవరం రూరల్ సీఐ సత్యకిషోర్ అన్నారు. స్వీప్ యాక్టివిటీస్‌లో భాగంగా శాంతి భద్రతలకు విఘాతం అనర్థం అనే నినాదంతో రూరల్ పోలీస్‌స్టేషన్లో కౌంటింగ్ రోజున ప్రజలు సహకారం అందించాలని కోరుతూ ప్రచార భేరి నిర్వహించారు. సీఐ సత్యకిషోర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగాయని, కౌంటింగ్ సమయంలో అందరూ సహకరించాలని కోరారు. స్వీప్ యాక్టివిటీస్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ శాంతి సామరస్యాలతోనే సమాజ ప్రగతి అని, కౌంటింగ్ రోజున ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని అన్నారు. రోటరీ క్లబ్ సభ్యులు బాబాజీ సాహెబ్ పాల్గొన్నారు.

అన్నసమారాధన



పాలకోడేరు, జూన్ 2: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పాలకోడేరు మండలంలోని గొల్లలకోడేరు, పాలకోడేరు గ్రామాల్లో అఖండ అన్నసమారాధన ఆదివారం నిర్వహించారు. గొల్లలకోడేరు గ్రామంలోని ఏఎస్‌ఆర్ నగర్‌లో ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం వద్ద విశేష పూజల అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఉచిత షుగర్ పరీక్షలు



తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 2: తాడేపల్లిగూడెం పట్టణంలోని జనతా హాస్పటల్‌లో తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ పరీక్షా శిబిరం ఆదివారం నిర్వహించారు. 83 మంది పరీక్షలు నిర్వహించారు. వాసవీ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ గ్రంధి సత్యనారాయణ, రీజియన్ ఛైర్‌పర్సన్ మదన్‌మోహన్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: ఉమర్ అలీషా



అత్తిలిలో మొక్కలకు నీరు పోస్తున్న దృశ్యం

అత్తిలి, జూన్ 2 : ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి భూతాపాన్ని తగ్గించటానికి కృషి చేయాలని డాక్టర్ ఉమర్ ఆలీషా పిలుపు నిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 104 ఆశ్రమ శాఖల ద్వారా లక్షలాది సభ్యులు ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని అంతర్జాలం ద్వారా ఉమర్ ఆలీషా పిలుపు నిచ్చారు. మొక్కలు నాటడమే కాక, అవి పెరిగే వరకు సంరక్షించాలన్నారు. పుట్టిన రోజు, పెళ్ళిరోజు తదితర వేడుకలకు మొక్కల పంపిణీ ఒక యజ్ఞంలా నిర్వహించాలన్నారు. అత్తిలి కన్వీనర్ నందం తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో మందుల్లేవ్



అంగన్‌వాడీ కేంద్రం భవనం

అత్తిలి, జూన్ 2: ప్రథమ చికిత్సకు ఉపయోగించే పెట్టెలు అంగన్‌వాడీ కేంద్రాల్లో లేకపోవడంతో అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు చిన్నారులు, బాలింతలు, చిన్నారులు, గర్భిణీలు ఇబ్బంది పడుతున్నారు. ఏడాది కిందట సరఫరా చేసిన కిట్లు కొన్ని చోట్ల కాలం చెల్లిపోవడంతో కార్యకర్తలు బయటపడేశారు. ప్రస్తుతం ప్రథమ చికిత్స పెట్టెలను రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేయడం లేదు. కిట్లలో పారాసిటిమాల్, అల్బెండాజోల్, కడుపునొప్పి మందు, దూది, స్పిరిట్, జలుబు, దగ్గు, వాంతుల నివారణ మందులు ఉండేవి. అవి లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో కార్యకర్తలే చిన్నారులకు సమకూరుస్తున్నారు. తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 233 కేంద్రాలు ఉన్నాయి. అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాలకు చెందిన కేంద్రాలు ఈ ప్రాజెక్టు పరిధిలోకి వస్తాయి. ప్రధానంగా కొన్ని కేంద్రాల్లో కాలం చెల్లిన మందులు కావడంతో అవి బయటపారేశారు. అనంతరం తిరిగి మందులు సరఫరా కాలేదు. దీంతో కార్యకర్తలు చిన్నారులకు ఏమైనా సమస్యలు తలెత్తితే ఇబ్బంది పడాల్సి వస్తోంది.

విజృంభిస్తున్న జ్వరాలు...

కానరాని ప్రథమ చికిత్స కిట్లు

గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ సమయంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రథమ చికిత్స కిట్లు అవసరం. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఆరు నెలల నుంచి ఆరేళ్ళ లోపు పిల్లలు ఉంటారు. గతంలో చిన్నారులకు చిన్న చిన్న సమస్యలు తలెత్తినప్పుడు కేంద్రాలకు వచ్చి మందులు తీసుకునే వారు. చిన్నారుల తల్లి దండ్రులు ఎవరైనా కేంద్రాలకు వెళ్ళి అడిగితే ప్రథమ చికిత్స కిట్లు రావడం లేదని కార్యకర్తలు సమాధానం ఇస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

భీమవరం టౌన్, జూన్ 2: ఈనెల 4 నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎం.దీప అన్నారు ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉండి, భీమవరం, తాడేపల్లి గూడెం నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలను ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎం. దీప ఆదివారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బంది అప్రమత్తంగా తమకు కేటాయించిన పనులలో ప్రధాన భూమికను పోషించి విధులను నిర్వర్తించాలని సూచించారు. విధులలో పాల్గొన్న సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. సూక్ష్మ పరిశీలకులకు ప్రతీ రౌండ్ కీలకమని పేర్కొన్నారు. ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని, ఎక్కడా పొరపాట్లు దొర్లకూడదని సూచించారు. అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లను ఏజెంట్లకు చూపించాలని, వారినుంచి సంతకాలు తీసుకోవాలని చెప్పారు. ఈవీఎం మిషన్లను తీసుకువచ్చేటప్పుడు, ఓట్లను లెక్కించేటపుడు మిషన్లు పాడవ్వకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. 4వ తేదీ మంగళవారం ఉదయం 5 గంటలకే కౌంటింగ్ సిబ్బంది ఆయా కౌంటింగ్ కేంద్రాలకు ఖచ్చితంగా చేరుకొనేలా చూడాలన్నారు. ఎలాంటి సందేహాలు అనుమానాలు ఉన్నా కూడా వెంటనే వాటిని నివృత్తి చేసుకోవాలన్నారు. విధుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా పూర్తిస్థాయి ఫలితాలు వెల్లడి అయ్యేవరకు బాధ్యతాయుతంగా తమ విధులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆర్వోలను సూచించారు.ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్, ఉండి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్ ఆదిత్య, భీమవరం ఆర్డీవో మరియు భీమవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కే శ్రీనివాసులు రాజు, తాడేపల్లిగూడెం ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి కే చెన్నయ్య ఉన్నారు.



దుగ్గిరాల చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

దేశభక్తుడు ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య

భీమవరం టౌన్, జూన్ 2: దేశ భక్తుడు, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతిని క్విట్ ఇండియా స్థూపం వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. బార్ అసోసియేషన్ సభ్యులు కామన రామకృష్ణ, వీరవల్లి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల త్యాగ ఫలితామే నేడు స్వేచ్ఛా భారతమని, దేశ భక్తుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య త్యాగం అజరామమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ తెలుగు నాట జానపద కళారూపాల పునరుద్ధరణకు గ్రంథాలయాల వ్యాప్తికి గోపాలకృష్ణయ్య ఇతోధికంగా కృషి చేశారని, ఆయన ప్రచారం చేసిన జానపద కళారీతులు- తోలు బొమ్మలాట, జముకుల కథ, బుర్రకథ, వీధి నాటకాలు, సాము గరిడీలు, గొల్ల కలాపం, బుట్ట బొమ్మలు, కీలు గుర్రాలు, వాలకాలు, గోసంగి, గురవయ్యలు, సరదా కథ, కిన్నెర కథ, కొమ్ము బూర,జోడు మద్దెల, పల్లె సుద్దులు అనేకం ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్ రాజు, ఉండపల్లి రమేష్ నాయుడు, సూర్యనారాయణ, ఎస్ కే చాన్ బాషా, ఆర్ ఎస్ సూర్యనారాయణ, ఎస్ వెంక టేశ్వరావు, కేజీ రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన ఓఎన్‌జీసీ పైప్‌లైన్ పనులు

నరసాపురం, జూన్ 2: మండలంలోని సీతారంపురం రిగ్గు నుంచి నరసాపురం టెంపుల్ ల్యాండ్ వరకు ఓఎన్‌జీసీ గ్యాస్ పైప్‌లైన్ పనులు ఆదివారం పూర్తయ్యాయి. సీతారాంపురం, వైఎస్‌పాలెం, రుస్తుంబాదా మీదుగా సుమారు ఒకటిన్నర కిలోమీటర్ మేర పైప్‌లైన్ పనులు చేపట్టారు. మూడేళ్ళ క్రితం ఓఎన్‌జీసీ తవ్వకాల్లో సీతారాంపురం వద్ద గ్యాస్ నిక్షేపాలు వెలుగుచూశాయి. గత ఏడాది పైప్‌లైన్ ద్వారా ఈ నిక్షేపాలు ఓఎన్‌జీసీ టెంపుల్ ల్యాండ్‌లోని ప్రధాన రిగ్గుకు తరలించేందుకు ఓఎన్‌జీసీ ప్రయత్నించింది. అయితే అప్పట్లో గ్రామస్థులు ఆందోళన దిగడంతో ఈపనులు ఆగాయి. ఇటీవల కలెక్టర్ సమక్షంలో రైతులు అంగీకరం తెలపడంతో గట్టి పోలీస్‌బందోబస్తు మధ్య పనులు పూర్తి చేశారు.



చెస్ పోటీల్లో పాల్గొన్న క్లబ్ సభ్యులు

యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలి

నరసాపురం టౌన్, జూన్ 2: యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు తరుచూ వివిధ ఆటల పోటీలు నిర్వహించాలని వాసవిక్లబ్ జిల్లా గవర్నర్ వీఎల్‌ఎన్‌వి ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం అప్పన్నప్లాజాలో జరిగిన వాసవి క్లబ్ జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. అయితే నేడు చాలా మంది క్రీడలను పూర్తిగా విస్మరించారన్నారు. ఆటలు వల్ల చురుకుదనంతో పాటు శరీర దృఢత్వం కూడా పెరుగుతుందన్నారు. ఈ పోటీల్లో షటిల్, చదరంగం, జూడో, క్యారమ్స్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతు లందించారు. ఈకార్యక్రమంలో క్లబ్ సభ్యులు జి.శ్రీనివాస్, నవీన్‌గుప్తా, పి.సత్యనారాయణ, అప్పన్న బద్రీ, మురళీ, ఫణికుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబును కలసిన రామరాజు



భీమవరం టౌన్, జూన్ 2 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును ఉండవల్లిలోని ఆయన నివాసంలో పశ్చిమ గోదావరిజిల్లా పార్టీ అధ్యక్షుడు, ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వ తేదీన వచ్చే ప్రజాతీర్పులో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని, ఆంధ్ర రాష్ట్ర భవిషత్తును మార్చబోతుందని రామరాజు అన్నారు. ముందుగా ఆయన చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

మందుబాబుల ముందు జాగ్రత్త

ముదినేపల్లి రూరల్, జూన్ 2: ఓట్ల లెక్కింపు సందర్భంగా మూడు రోజుల పాటు మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశాలుండడంతో మందు బాబులు మద్యం కోసం ఆదివారం బారులు తీరి ఒక్కొక్కరు రెండేసి సీసాలు చొప్పున కొనుగోలు చేసి నిలువ చేసుకుంటున్నారు. మరోపక్క బెల్టుషాపు నిర్వాహకులు సైతం ప్రభుత్వ మద్యం షాపుల సిబ్బందితో కుమ్మక్కై దొడ్డిదారిన మద్యం కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. ఇప్పటికే ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో నాలుగు రోజుల నుంచి పర్యటించి బెల్ట్‌షాపు నిర్వాహకుల పై కేసులు నమోదు చేస్తున్నారు. మద్యం దొరికితే నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నా షాప్ నిర్వాహకులు ఏ మాత్రం బెదరకుండా మద్యం కొనుగోలు చేసి నిల్వ చేయటం గమనార్హం.



రాజకీయ పార్టీల ఏజెంట్లతో మాట్లాడుతున్న స్పెషల్ ఎస్పీ శ్రీనివాస్

నిబంధనలు ఉల్లంఘిస్తే జైలుకే

తణుకు, జూన్ 2: ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే జైలుకేనని తణుకు నియోజకవర్గ స్పెషల్, తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాసు హెచ్చరించారు. ఆదివారం తణుకులో రాజకీయ పార్టీల ప్రతినిధులు, కౌంటింగ్ ఏజెంట్లు, కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కౌంటింగ్ సమయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ప్రవర్తించినా, వివాదాలు, అల్లర్లు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 15 చోట్ల పోలీసు పికెటింగ్‌లు ఏర్పాటు చేసి, రౌడీ షీటర్లు, అనుమానితులపై నిఘా ఉంచామన్నారు. కౌంటింగ్ కేంద్రం లోపలకు వెళ్ళే ఏజెంట్లు సెల్‌ఫోన్, ఇతరత్రా ఎలక్ట్రానిక్ వస్తువులు తమతోపాటు తీసుకెళ్ళేందుకు అనుమతి లేదన్నారు. డీఎస్పీ మూర్తి, మెరైన్ సీఐ డీవీజే రమేష్‌కుమార్, పట్టణ, రూరల్ సీఐలు ఎం.నాగరాజు, జీవీవీ నాగేశ్వరరావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి: ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని అడిషనల్ డీఎస్పీ బాషా, రైల్వే డీఎస్పీ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఉండి ప్రధాన సెంటర్‌ను వారు పరిశీలించారు. ఈనెల 4వ తేదీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నేపథ్యంలో ఎటువంటి అల్లర్లకు పాల్పడినా ఉపేక్షించేదిలేదన్నారు. బాణ సంచాకాల్చడం, సౌండ్స్, మోటార్‌బైక్‌తో హారన్‌లు, తదితరవి చేసిన చర్యలు తప్పవన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించినట్లయితే ఆటువంటి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమలో ఎస్‌ఐ లక్ష్మణ్ ఏఎస్‌ఐ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు



తణుకు, జూన్ 2: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా అందించే ఉచిత వైద్య సేవలను ఆదివారం డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి ఎన్. మహేంద్ర, డాక్టర్ ఎస్. అనుస్మిత తణుకు, మండపాక, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి 15 మందికి అందించారు. డాక్టర్ కేవీ రావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు ఎన్. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మానవతకు రూ. లక్ష ఆర్థిక సాయం



తణుకు, జూన్ 2: మానవత సేవలను అభినందిస్తూ తణుకు పట్టణానికి చెందిన చిట్టూరి సుజాత లక్ష రూపాయలు సంస్థకు విరాళంగా ఆదివారం అందజేశారు. ఆదివారం సంస్థలో జరిగిన కార్యక్రమంలో మానవత శాంతి ర్యాలీ జిల్లా ఛైర్మన్ గమిని రాంబాబు, కోశాధికారి అక్కిన కాశీ, డాక్టర్ రామలక్ష్మి, పోతుల శ్రీనివాసు, పూలమాల వీరభద్రం, మల్లిపూడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కూటమి గెలుపు ఖాయం: వలవల



తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 2: రాష్ట్రంలో కూటమి గెలుపు ఖాయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ కూటమి గెలుస్తుందని చెప్పడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సుమారు 130 నుంచి 155 సీట్లతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. అన్ని సర్వేలు కూటమి గెలుపు ఖాయమని చెబితే ఆరా మస్తాన్‌రావు మాత్రం వైసీపీ గెలుస్తుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ కార్యకర్తలను తృప్తి పరిచేందుకే ఈ సర్వే చేశారన్నారు. అధికారంలోకి రాబోతున్న కూటమి ప్రభుత్వానికి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.

కృష్ణబాబుకు నివాళులు



కృష్ణబాబు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రఘురామ కృష్ణరాజు

ఉండి, జూన్ 2:మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని ఉండి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కనుమూరు రఘు రామకృష్ణరాజు అన్నారు. ఆదివారం దొమ్మేరు వెళ్లి కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సోదరుడు అచ్చిబాబును, కుటుంసభ్యులను పరామర్శించారు. ప్రజలకు ఆయన అందించిన సేవలను గుర్తుచేశారు. నివాళులు అర్పించిన వారిలో ఉండి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జు జుత్తుగ నాగరాజు తదితరులున్నారు.

సుబ్రహ్మణ్య స్వామి ఆలయ వార్షికోత్సం



పోడూరు, జూన్ 2: గుమ్మలూరు శివారు రావిగొప్పులో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ పునర్నిర్మాణ దాత పెన్మెత్స వెంకట నరసింహరాజు దంపతులు చేతులు మీదుగా ప్రత్యేక కలశ పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

నేడు మాచేనమ్మ పెద్ద జాతర



ఆచంట, జూన్ 2: పెదమల్లం మాచేనమ్మ, పల్లాలమ్మ అమ్మవార్ల జాతర వేడుకగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు పెద్ద జాతర మహోత్సవం సోమవారం రాత్రి పెద్ద ఎత్తున నిర్వహించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే 4న అమ్మవారి ఊయల ఉత్సవం భక్తులు నిప్పుల గుండాలు తొక్కే కార్యక్రమాలు జరుగుతాయి. 5న అమ్మవారికి పానుపులు వేసే కార్యక్రమం అమ్మవారిని అత్త వారింటికి పంపే కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి. అమ్మవారి జాతర ఉత్సవాలు పురస్కరించుకుని ఆలయ అధికారి రాము సిబ్బంది కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అమ్మవారి ఆలయానికి విరాళం

పెనుగొండ, జూన్ 2: వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయానికి తూర్పుగోదావరి జిల్లా దుళ్ళ గ్రామానికి చెందిన యన్నమని వీర వెంకట కాశీ విశ్వేశ్వరరావు, శ్రీవల్లి దంపతుల కుమారుడు సూర్య సత్య కార్తీకేయ కుటుంబ సభ్యులు 10,121 రూపాయలు విరాళంగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని అభినందించారు.



బండి ముత్యాలమ్మకు భక్తుల రద్దీ

మొగల్తూరు, జూన్ 2: ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని వారి మొక్కుబడులైన దూప హారం, కుంభహారాలను అమ్మవారికి నివేదించారు. ఆలయం వద్ద భక్తులకు కావల్సిన సదుపాయాలను ఈవో డి.రామకృష్ణంరాజు పాలకవర్గ సభ్యులు కల్పించారు.

పేకాట స్థావరంపై దాడి

ఆకివీడు, జూన్ 2: ఉప్పుటేరు సమీపంలో పేకాటాడుతున్న అరుగురు నుంచి రూ.7,600 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ బత్తిన నాగబాబు తెలిపారు.

చర్చిల్లో టీడీపీ శ్రేణుల ప్రార్థనలు

ఆకివీడు, జూన్ 2: కూటమి అభ్యర్థులు అఖండ విజయం సాధించాలంటూ ఆదివారం టీడీపీ శ్రేణులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో గొంట్లా గణపతి, జన్ను గోపి, కిమిడి నాగరాజు, పెద్దిరాజు, దూబ సురేష్, రామరాజు పాల్గొన్నారు.

బలహీనవర్గాల సంక్షేమం కోసం కృషి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సోడదాసి గంగయ్య

కాళ్ల(ఉండి), జూన్ 2: ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం తాము నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆశాఖ రాష్ట్ర అధ్యక్షుడు సోడదాసి గంగయ్య అన్నారు. ఆదివారం కాళ్ల మండలం కాళ్లకూరులో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో కొండా రాజేష్‌కుమార్, మర్రి కృపదానం, తాళ్లూరి రాజ్‌కుమార్, సోడదాసి రత్నంరాజు, గుర్రం వెంకటరత్నం, యోబు, దిలీప్, సద్గుణరావు, జేమ్స్, అహరోను, నేతల నతనీయేలు, జాన్, జయరాజు పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 2: ఓట్ల లెక్కింపు సమయంలో కౌంటింగ్ ఏజెంట్‌లు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం, తాడేపల్లిగూడెం వైసీపీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ సూచించారు. తాడేపల్లిగూడెంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద కౌంటింగ్ ఏజెంట్‌లకు పలు సూచనలు చేశారు. ఏపీ అప్పడా వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాం నాయుడు, నాయకులు కర్రి భాస్కరరావు, చెన్నా జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న పాలకొల్లు శాఖా గ్రంథాలయ భవనం

గ్రంథాలయానికి సొంత భవనం కలేనా..?

పాలకొల్లు అర్బన్, జూన్ 2 : పాలకొల్లు శాఖా గ్రంథాలయం ఏర్పడి ఇప్పటికి సుమారుగా 54 ఏళ్ళకు పైగా అయ్యింది. అప్పటి నుంచి అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ప్రతీ రోజూ సుమారుగా రోజు 50 నుంచి 70 మంది వరకు పాఠకులు, విద్యార్థులు వస్తుంటారు. గ్రంథాలయంలో సభ్యులుగా 4వేల మందికి పైగా నేటికి కొనసాగుతున్నారు. 26 వేలకు పైగా పలు గ్రంథాలు ఇక్కడ పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. అయితే నెలకు రూ.16,365 అద్దె చెల్లిస్తూ ఈ గ్రంథాలయం నడుస్తోంది. గ్రంథాలయానికి ఒక లైబ్రేరియన్, కాంట్రాక్ట్ బేసిస్‌పై స్వీపర్ మాత్రమే ఉండటం వల్ల గ్రంథాలయ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వంగా నరసింహారావు చెబుతున్నారు. గ్రంథాలయానికి సొంత భవనం నిర్మించాలని గతంలో ఎందరో ప్రయత్నించినప్పటికీ వీలు కాలేదు. ఆరు ఏళ్ళ క్రితం పట్టణంలోని బీఆర్ఎంవీఎం హైస్కూల్‌కు ఉన్న స్థలం (పాత భవనం తొలగించిన ప్రాంతం)లో 10 సెంట్లు ఇవ్వాలని గ్రంథాలయ కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. అయితే ఈస్థలం ఇవ్వడానికి దాతలు అంగీకారం తెలియజేయాలని అధికారులు చెప్పడంతో పాటు కరోనా వల్ల పనులు ముందుకు సాగలేదు. భవనం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ స్థలం లేకపోవడంతో అద్దె భవనంలోనే కొనసాగుతోంది. గ్రంథాలయానికి నైట్ వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, అటెండరు పోస్టులు ఖాళీలను భర్తీ చేయాల్సి ఉందని అభివృద్ధి కమిటీ సభ్యులు చెబుతున్నారు. ఇప్పటికైనా స్థల సమస్యను పరిష్కరించి, గ్రంథాలయ భవన నిర్మాణానికి సహకరించాలని పలువురు పాఠకులు కోరుతున్నారు.